పద్ధతిలో పెరుగుతున్న పూలమొక్కలు. వాటిమధ్య తిరుగాడుతున్న వివిధ రకాల కోళ్లు, బాతులు, ఇతర పక్షులు, కొన్ని కుందేళ్లు. పక్కనే మానేరు తీరం. దూరంగా వినిపిస్తున్న నెమళ్ల కూతలు. ఆహ్లాదకరమైన గాలి.. సాగర్‌ను పరవశింప చేస్తున్నాయి.

రాత్రి భోజనం చేసిన తరువాత ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలని సాగర్‌కు ఉన్నప్పటికీ..

''ప్రయాణ బడలికతో ఉన్నావు.. రెస్ట్ తీసుకోరా! రేపు ఎంతైనా మాట్లాడుకోవచ్చు'' అన్న మాధవ్ మాటలతో.. ఏసీ లేనిదే కన్నుమూయని సాగర్, మానేటి అలలపై నుంచి వీస్తున్న మలయమారుత మార్దవ స్పర్శ ఒంటికి తాకగానే.. హాయిగా నిద్రలోకి జారుకున్నాడు.

మునుపెన్నడూ విని ఎరుగని పక్షుల కిలకిలారావాల సంగీత ధ్వనులు చెవులకు సోకగానే ఐదు గంటలకే సాగర్ నిద్ర మేల్కొన్నాడు. అప్పటికే మాధవ్ మిత్ర బృందం సుమారు ఇరవైమంది అక్కడికి చేరుకున్నారు. సాగర్‌ను తన చిన్ననాటి మిత్రునిగా అందరికీ పరిచయం చేశాడు మాధవ్. అందరూ కలిసి మానేరు తీరంలో మార్నింగ్ వాక్ చేస్తుంటే, చుట్టూ ఎగురుతున్న పక్షులు, మేనును గిలిగింతలు పెడుతున్న చల్లని గాలులు, అప్పుడే విచ్చుకుంటున్న భానుడి లేలేత కిరణాలు.. సాగర్‌కు కొత్త అనుభూతిని పంచుతున్నాయి.

మాధవ్ మిత్రుల్లో ఎక్కువగా విశ్రాంత ఉద్యోగులు, కొందరు యువకులు ఉన్నారు. ఒక్కొక్కరూ ఒక్కో జోక్ వేస్తున్నారు. పొట్టచెక్కలయ్యేలా కడుపారా హాయిగా నవ్వుకుంటున్నారు. సమకాలీన రాజకీయాలను భిన్న పార్శ్వాల్లో చర్చించుకుంటున్నారు. కొందరు పాటలు పాడుతున్నారు. ఇంకొందరు సాహిత్య విషయాలను చర్చకు పెడుతున్నారు. సుమారు గంటన్నర తరువాత అందరూ తిరిగి చార్వాక జ్ఞాన కేంద్రానికి వెళ్లి, వేడివేడి రాగి జావ తాగి వెళ్లిపోయారు.

సాగర్ జీవితంలో ఏనాడూ ఇంత అందమైన ఉదయాన్ని చూడలేదు. నిద్రలేచింది మొదలు ఆలోచనలన్నీ వ్యాపారం మీదనే. పీఏ సిద్ధం చేసిన ప్రోగ్రాం ప్రకారం ఉదయం నుంచి రాత్రి వరకు దేశవిదేశాల్లోని డీలర్లతో వ్యాపార లావాదేవీలు, విస్తరణ ప్రణాళికలతో నిరంతరం మునిగిపోతుంటాడు. విందులు, వినోదాలు కూడా ఉంటాయి.. స్టార్ హోటళ్లల్లో, కోటీశ్వరుల బంగళాల్లో. అత్యంత ఖరీదైన పార్టీలలో పాల్గొన్నప్పటికీ.. అవి బిజీ జీవితంలో ఆటవిడుపుగా ఉండేవే కానీ, అనిర్వచనీయమైన ఆనందాన్ని పంచేవి కావు. అది ఈనాడు అనుభవించాడు సాగర్.

నేషనల్ సైన్స్ డే సందర్భంగా స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ప్రధాన వక్తగా మాట్లాడటానికి వెళ్తూ.. సాగర్‌ను కూడా వెంట తీసుకువెళ్లాడు మాధవ్.

ప్రపంచంలోనే యువత సంఖ్య ఎక్కువగా కలిగిన భారతదేశం, భవిష్యత్తును శాసించగలిగే సత్తా కలిగి ఉందని చెబుతూ, యువత ఛాందస భావాలను విడనాడి, శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మక ఆలోచనల్ని, నూతన ఆవిష్కరణల పట్ల ఆసక్తిని, ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకుంటే ప్రపంచానికే భారతదేశం మార్గదర్శకంగా నిలుస్తుందని చెబుతూ.. ఇంకా అనేక విషయాలను ప్రస్తావిస్తూ మాధవ్ చేసిన ప్రసంగం విన్నాడు సాగర్.

మరునాడు సాయంత్రం, చార్వాక జ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం వాళ్లు ఏర్పాటుచేసిన సభలో ప్రధానవక్తతో పాటుగా, మాధవ్ మాట్లాడిన ప్రసంగం సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలలో అతనికున్న లోతైన అవగాహనకు దర్పణంలా ఉంది.

సాగర్‌కు మొదటిసారి మిత్రుడిమీద ఉన్న ప్రేమ స్థానంలో గౌరవం కూడా చోటుచేసుకుంది. మాధవ్‌తో గడిపిన బాల్యజీవితపు స్మృతులన్నీ ఒక్కొక్కటిగా మనోయవనికపై దృశ్యాలుగా కదలాడుతున్నాయి.

''మాధవ్, నేనూ బుడిబుడి అడుగులతో ఒకేసారి బడిలో అడుగుపెట్టిన వాళ్లం. ఒకేరకమైన పేదరికం అనుభవించినవాళ్లం. ఇంటర్ వరకూ సమాంతర చలనంగా సాగిన జీవితం. తదనంతరం ఇద్దరి మధ్యా ఎంత వ్యత్యాసాన్ని తీసుకువచ్చింది? మేం నడిచిన ఈ సుదీర్ఘ ప్రయాణంలో జీవితం ఎవరిని, ఏ తీరానికి చేర్చింది అన్నది మేం ఎంచుకున్న మా ప్రాథమ్యాలే నిర్దేశించాయి. నేను నా ఒక్కడి పేదరికాన్ని జయించడానికి శ్రమించి, విజయం సాధించాను. కానీ, మాధవ్ సామూహిక దుఃఖాన్ని తన దుఃఖంగా చేసుకొని, వ్యవస్థాగతమైన మార్పును ఆకాంక్షించాడు. వాడు వాడి లక్ష్యం సాధించడంలో కృతకృత్యుడయ్యాడు. తేడా నేను సాధించిన దానితో సంతృప్తి చెందడం లేదు. వాడు సాధించిన దానితో సంతృప్తిగా జీవిస్తున్నాడు. ఇంకా చెప్పాలంటే.. నాకు పొందడం మాత్రమే తెలుసు. వాడికి ఇవ్వడమే తెలుసు!'' ముప్పిరిగొన్న ఆలోచనల్లోంచి తేరుకోగానే, ఏదో జ్ఞానబోధ జరిగినట్లు సాగర్ మనసు తేలిక పడింది.

చార్వాక జ్ఞాన కేంద్రం ద్వారా జరుగుతున్న కార్యక్రమాలన్నీ కూడా భావసారూప్యత గల వ్యక్తులు, సమూహాల సహకారంతోనే సాధ్యమవుతున్నాయి. గోడల మీద రాసిన అనేక కొటేషన్లలో ఒకటి.. 'సమాజం మీకెంతో ఇచ్చింది – సమాజానికి మీరెంతో కొంత ఇవ్వండి'. ఈ స్ఫూర్తితోనే అక్కడి కార్యక్రమాల్లో పాల్గొనే అనేకమంది స్వచ్ఛందంగా ఆర్థికసహాయం అందిస్తారు.

నెల రోజులుగా అక్కడే ఉండి, అక్కడి కార్యక్రమాలలో మాట్లాడుతున్న భిన్నరంగాలకు చెందిన వక్తల ప్రసంగాలు విన్న సాగర్‌లో ఒక గుణాత్మకమైన మార్పు చోటుచేసుకుంది. అసలైన జీవిత పరమార్థం బోధపడింది. తనలో మొదలైన సంఘర్షణకు సమాధానం దొరికినట్లయింది.

ఓరోజు సాయంత్రం మిత్రులిద్దరూ లాన్‌లో కూర్చుని, అప్పుడే తెంపుకొచ్చి కాల్చిన వేడివేడి మక్కకంకుల్ని తింటూ చిన్ననాటి ముచ్చట్లెన్నో కుప్పవోసుకుంటున్నారు. ఆ ముచ్చట్లను వినాలనుకుని వచ్చాయా అన్నట్లు, వాళ్ల చుట్టూ తిరుగుతున్నాయి సీతాకోకచిలుకలు. తింటూ తింటూ కొన్ని గింజల్ని విసిరేస్తుంటే.. వాటిని ఏరుకుంటూ గుంపుగా చేరాయి కోడిపిల్లలు. మాధవ్ పిలవగానే కుయ్ కుయ్‌మంటూ తోక ఊపుకొంటూ పక్కనే కూచొని ప్రేమను ఒలకబోస్తున్నాయి రెండు కుక్కపిల్లలు. మేనిని తాకుతున్న చల్లని గాలులు, చెవులకు వాయులీనాల గానాలు మంత్రస్వరంలో వినిపిస్తున్నట్లున్న మధురానుభూతి. ఆ ప్రశాంత సమయంలో సాగర్‌లో మళ్లీ ఆలోచనలు.

'ఎప్పటికీ ఇక్కడే ఉంటే!? ఏమీలేకున్నా సరే.. అన్నీ వదిలేయవచ్చు. నిజానికి అన్నీ వదిలేయగలనా? అన్నీ వదిలేసి నన్ను నేను ఖాళీ చేసుకోగలనా? నాలో నిండా నిండి ఉన్న కోరికలు, స్వార్థం, అసంతృప్తి, అసూయల చెత్తనంతా ఖాళీ చేయకుండా మాధవ్ అనుభవిస్తున్న జీవన సౌందర్యాన్ని నాలోకి ఒంపుకోగలనా? ప్రతీ క్షణం ఆనందంగా జీవించాలంటే, మరుక్షణమైనా మరణించడానికి సిద్ధంగా ఉండటమే కదా మార్గం'..

''ఓరేయ్ మాధవా! నిన్నొక మాట అడగాలనుందిరా''.

''అడగరా.. దానికి మొహమాటమెందుకు?''.

''నా శేషజీవితం నీతోపాటు ఇక్కడే గడిపేందుకు నాకు అవకాశమిస్తావా?''.

''ఆనందంగా ఉండొచ్చురా.. కానీ, సకల సౌకర్యాలను వదులుకొని నువ్విక్కడ..''

''ఆ సౌకర్యాలన్నీ భ్రమల బందీఖానాలో మనం కప్పుకొన్న ముసుగులు. అసలైన జీవన సాఫల్యత ఏమిటో ఇక్కడికి వచ్చాకే తెలుసుకున్నానురా!''.

మాధవ్.. సాగర్ చేతిని తన చేతిలోకి తీసుకొని..

''ఈ జ్ఞాన కేంద్రం నా ఆస్తి అని, నాకే సొంతమని ఏనాడూ భావించలేదురా! దీన్ని ఎప్పుడో సమాజపరం చేశాను. ఎందరో చేసిన త్యాగాల వెలుగులు మనవరకూ అందాయి. మనం కూడా కొంత త్యాగం చేస్తేనే ముందుతరాల వాళ్లు మెరుగైన జీవితాన్ని అందిపుచ్చుకుంటారు. మనం ఒక్కళ్లం చేస్తేనే జరగకపోవచ్చు. మన వంతుగా ఎంతోకొంత చేసి కొత్త బాట వేస్తే, ఇంకొందరెవరో ఆ బాటను విశాలం చేస్తారు!'' అన్నాడు మాధవ్.

సాగర్ అమెరికాలో ఉన్న కొడుకును భారత్‌కు రప్పించి, ఇద్దరు కొడుకుల సమక్షంలో తన లాయర్‌తో వీలునామా రాయించాడు. తన అన్ని కంపెనీలలో కొడుకుల పేరుమీద ఉన్న షేర్లను ఇద్దరికీ సమంగా పంచేసి, తన పేరుమీదనున్న షేర్లన్నిటినీ చార్వాక జ్ఞాన కేంద్రానికి రాసిచ్చాడు.

సాగర్ ఇప్పుడు సంపూర్ణంగా తనను తాను ఖాళీ చేసుకున్నాడు... సంపదను, సకల బంధాలను, సమస్త మనోమాలిన్యాలను!

ఇప్పుడతను జరామరణ భయాలు లేని అలౌకికానంద మానవుడు. ■

## గాజోజు నాగభూషణం



అలిశెట్టి ప్రభాకర్ సాన్నిహిత్యంతో.. సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు గాజోజు నాగభూషణం. ఈయన స్వస్థలం జగిత్యాల. ప్రస్తుతం కరీంనగర్‌లో నివాసం. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ.. కవి, రచయిత, గాయకుడిగానూ ప్రతిభ చాటుతున్నారు. కల్లోలిత ప్రాంతమైన జగిత్యాల చుట్టూ జరిగిన రైతాంగ ఉద్యమాల ప్రభావంతో కవిగా మారారు. ఆ తర్వాత నిరంతర ఉద్యమాల భాగస్వామ్యం, మానవ జీవన విధ్వంస మంతా కథల్లో ప్రతిఫలించడం వల్ల.. కథలు రాయడం ఆరంభించారు. కవిత్వంలో 'మట్టి సరిగమలు', 'ప్రాణదీపం' సంకలనాలు వెలువరించారు. 'నెత్తుటి గాయాలు' పేరుతో తెలంగాణ ఉద్యమ గేయాలు రచించి, గానం చేశారు. ఇప్పటివరకూ 20 కథలు రాశారు. నమస్తే తెలంగాణ – ముల్కనూరు ప్రజా గ్రంథాలయం కథల పోటీల్లో వరుసగా మూడు సంవత్సరాలు బహుమతులు అందుకున్నారు. అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య పురస్కారంతోపాటు అనేక రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్నారు. జీవితాన్ని ఉన్నతీకరించడంలో సాహిత్యానిది కీలక భూమిక అని విశ్వసిస్తారు.